# 22

# లచ్చవ్వ

## ఊబి

**(కథాకాలం 1984-86)**

"ఊc పండుకో" హెచ్చరించాడు నర్సయ్య.

"గింత ఉడుకపోస్తున్నది. ఒకెయి చెమటలు గారుతున్నై. చెమటకాయ గీకి గీకి పెయ్యంత మండుతున్నది. ఊరంత వాకిట్లల్ల పంటే నువ్వేమో యింట్ల. ఇంట్ల పండుకుంట యింక మీదికెల్లి దుప్పటి ఎట్ల కప్పుకోబుద్దవుతున్నది ?"

పెనిమిటి చేష్టలకి చిరాగ్గా అంది లచ్చవ్వ. కుక్కి మంచంలో పౌరుషంగా కదిలాడు నర్సయ్య. మరింత ఊబిలోకి కూరుకుపోతున్నట్టు బాధగా మూలిగింది మంచం. కప్పుకున్న దుప్పటి ముసుగు యింకా బిగుసుకుంది.

జగిత్యాలకి ఉత్తరాన పదికిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెలో వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది. కాని బాగా ఉక్కపోతగా వుంది. గూట్లోని గుడ్డిదీపం ఎర్రగా కాలుతోంది. కాని నల్లగా పొగ చూరుతోంది. ఇల్లంతా ఉక్కపోత. దానికి తోడు కిర్సనాయిల్ పొగతో యిల్లంతా కంపు వాసన కొడుతోంది. అయినా కిటికీ తలుపులు, దర్వాజా మూసే వున్నాయి. ఇంటి తలుపు చెక్కల సందుల్లోంచి అయినా గాలి రావడంలేదు.

లచ్చవ్వ అప్పుడే భోజనం ముగించినట్టుంది. ఒళ్లంతా చెమటలు కక్కుతోంది. ఏ కాస్త్రా సందులేదు. ఒళ్ళంతా చెమటకాయే. ఎవరిమీద కోపమో. బర్రుబర్రున గీకుతోంది. తలలోంచి ఉప్పు చెమట కళ్ళలోకి దిగుతోంది. నొసలూ, కళ్ళూ మంట పుచ్చుకున్నాయి. విసుగ్గా కళ్ళు నలుచుకుంది. దాంతో మరింత మండుతున్నాయి. లేచి ముహం మీద నీళ్ళు చల్లుకుంది. మురికి కొంగుతో తుడుచుకుంది. ఎక్కడా అలికిడి లేదు. అంతలో బయట జీపు చప్పుడు విన్పించింది. అది పోలీసు జీపేమో. వీధంతా కలకలంగా వున్నట్టుంది. ఎక్కడి వాళ్ళక్కడ లేచి

పరుగులు తీస్తున్నట్టున్నారు. మంచాలు ఎత్తుకున్న చప్పుడూ, నిద్రనుంచి లేచిన పిల్లల ఏడ్పులూ.

ఖాకీవనం నిర్బంధం బయట వెన్నెల్లా బహిరంగంగా అంతటా పరుస్తున్నట్టుగా వుంది. అయినా వీళ్ళకి అవేమీ పట్టినట్టు లేదు. నర్సయ్యకి అన్నీ వినబడుతూనే వున్నాయి. అయినా కదల్లేదు. తనకు లేని వెన్నెల సుఖం వాళ్లెందుకో. అందుకేనేమో ఆ జీపు చప్పుడు దున్నపోతు మీది వానలా హాయిగా వుంది.

ఇల్లంతా ఉక్కపోతగా వుంది. చాపలో ఒదిగిన పిల్లలు లేచికూర్చున్నారు. చెమటకాయ బాధ వశపడనివ్వడం లేదు. తల్లి పక్కన చేరారు పిల్లలు. తల్లిలాగే పర్రుపర్రున గీరుతున్నారు. గీరినాకొద్దీ హాయి మంటోంది. మరుక్షణం మరింత మండుతోంది. ఉమ్మితో అద్దుతున్నారు. మళ్ళీ అదేపనిగా గీరుతున్నారు. వాళ్ళ కళ్ళ మీది నిద్ర తేలిపోయింది.

బర్రున ముక్కు చీదాడు పెద్దోడు. మీద చిల్లినట్టయి చేత్తో పెదవులు తడుముకుంది లచ్చవ్వ. పొగచూరిన చీమిడి కండ నల్లగా బంకలు సాగుతూ చేతికంటుకుపోయింది. అసహ్యంగా గోడకేసి రాసింది. వాడూ అదే పని చేశాడు. అలా రాసి రాసి పొగచూరిన గోడంతా అసహ్యంగా వుంది. అది దీపం వెలుగుకి జలగ వదిలేసిన జిగురులా దగదగ మెరుస్తోంది.

వాడు మాత్రం ఏం చేస్తాడు పాపం. వాడికి రావడమైతే జలుబు ఏడాదికి రెండుసార్లే వస్తుంది. అయితే అది వచ్చినప్పుడల్లా ఆర్నెల్లుంటుంది. కూతురు చాప మీంచి లేచింది. ఇన్ని మంచినీళ్ళు తాగి మళ్ళీ గీకడంలో పడింది.

మరింత ఉక్కపోతగా వుంది. కొంగు ఊపుకుంది లచ్చవ్వ. అయినా లాభంలేదు. అసలు గాలి ఆడ్డంలేదు. బయట అలికిడి తగ్గినట్టుంది. జీపుచప్పుడు విన్పించడం లేదు. మళ్ళీ మంచాలన్నీ వాకిళ్ళలోకి చేరుతున్న చప్పుడు వినిపిస్తోంది.

భర్తకేసి అదోలా చూసింది లచ్చవ్వ. మెల్లిగా జాగ్రత్తగా తలుపు తీయబోయింది. అయినా అది కిర్రుమని అననే అంది. ఒక్కక్షణం జడుసుకుంది. అనుకోకుండానే భర్తకేసి చూసింది. బస్తాలో మూటకట్టినట్టుగా పడుకొన్నాడు నర్సయ్య. మోరుదోపు పందుల్ని అమ్మకానికి తీసికెళ్ళేప్పుడు అచ్చం అలాగే మూట కడ్తారు. మోరుదోపు పందులు నాల్గు కాళ్ళు కట్టినా ఊరుకోవే. అవి ఎవరైనా

దొడ్డికి కూర్చోవడం ఆలస్యం గుర్రుగుర్రుమని పరిగెత్తుకొస్తాయి. తిన్న మూతితోనే ఎపుడు ముందుకు పడదోస్తాయో తెలియదాయె.

అనుకున్నట్టుగానే ముసుగుతీయకుండా గురగురమన్నాడు నర్సయ్య.

"ఊఁ, జెల్ది పండుకోన్రి. రాత్రయింది."

పెద్దవాడు మళ్ళీ బర్రున చీదాడు. గోడకు రాసిన చీమిడిలో ఈగ యిరుక్కు పోయింది. ఆ ఈగని చూసినట్టుగా భర్తకేసి అసహ్యంగా చూసింది లచ్చవ్వ.

'హుఁ' అని వున్న కోపాన్నంతా ముక్కుతో గునిసింది. బయటకు నడిచింది. వాకిట్లో నిలబడింది. తల్లి వెంట పిల్లలు నడిచారు.

బయటకూడా గాలి స్థంభించింది. ఒక్క చెట్టయినా ఊగడం లేదు. ఒక్క ఆకైనా కదలడం లేదు. ఒళ్ళంతా జిగట జిగటగా వుంది. చమటతో కంపు కంపుగా వుంది. ఆ సాయంత్రమే స్నానం చేశారు. ఐనా తమది తమకే అసహ్యంగా వుంది. మళ్ళీ స్నానం చేస్తే బావుండుననిపిస్తోంది.

అదే మాట తల్లిని అడుగుదామని పెద్దోడు నోరు తెరిచి మళ్ళీ టపీమని మూసుకున్నాడు. ఈ రాత్రి తానమేందిరా అని ఈ కోపం ఆ కోపంతో దబాదబా బాదినా బాదుతుంది.

ఆ వాడకు వాడ అందరూ బయట పడుకున్నారు. ఇంతకు ముందే జీపు వచ్చిపోయిందని తెలిసేట్టుగా ఏమీలేదు. మంచాలపైనో కింద చాపల్లోనో హాయిగా నిద్రపోతున్నారు.

గాలికి వెన్నెట్లో హాయిగా పడుకొని ఎన్నాళ్ళయిందో.

నిజంగానే వెన్నెట్లో చల్లగాలికి పడుకోవడానికి కూడా పెట్టి పుట్టాల్నేమో. 'ప్చ్'. భారంగా నిట్టూర్చింది లచ్చవ్వ.

"తిన్నావె లచ్చవ్వ?"

రెండిళ్ళవతలి చిన్న రాజవ్వ ఆవలిస్తూ పలకరించింది. అవుతలకి పోయి వచ్చినట్టుంది. మళ్ళీ మంచంలో ఒరగబోయి లచ్చవ్వను చూసింది.

"మా తిన్న" మళ్ళీ బర్రు బర్రున గీరుతోంది లచ్చవ్వ.

"వాకిట్ల పండరాదే లచ్చవ్వా ? వాకిట్లనే గింత ఉదుక పోస్తున్నది. రోజూ యింట్ల ఎట్ల పంటున్నరే? దొంగలొస్తే సక్కగ మీ దగ్గరికే వస్తారే? అంతగనం ఏం ముల్లె గట్టిన్రే?"

లచ్చవ్వ మారు మాట్లాడలేదు. అలా ఇరుగుపొరుగు అనడం వాళ్ళ వంతయిపోయింది. విని ఊరుకోవడం తన వంతయిపోయింది.

"అవ్వా ! మనం యివుతల పందామే" గీకే తల్లి మోచేయి పట్టుకొని గారాలు పోయింది కూతురు. పెద్దోడు వంతపాడాడు.

అదేమీ పట్టనట్టుగా వుంది లచ్చవ్వ. ఒళ్ళు మంటకి రైక విప్పేసింది. చొప్ప బెండుతో వెన్ను గీరుకుంటోంది.

సత్తెవ్వ గోముగా తల్లి వెన్ను మెత్తగా గీకుతూ కాకా పడుతోంది.

లచ్చవ్వ స్థితి అలాగే వుంది. మగన్ని అడక్కుండానే బయట మంచం వేసుకోవాలన్నంత తిక్కగా వుంది. కాని ధైర్యం చాలడం లేదు. వారం క్రితం ఇలాగే చేసింది. పెనిమిటి అర్ధరాత్రి లేచి చూసేసరికి ఏముంది? లచ్చవ్వ వాకిట్లో వుంది. ఆ రాత్రి పొయిల కట్టెతో ఎంత జోపాడు. తన కేకలకి ఈ వాడవాడంతా లేచి కూర్చుంది. అయినా ఎవరూ అదేమని అడ్డం రాలేదు. రాత్రిగదా. వాడేం అడిగాడో, ఇదేం అన్నదో అని వూరక చూస్తుండిపోయారు. తనకు ఎవరున్నారు గతి. అందరికీ కంటు అయిపోయింది.

ఎలాగో ధైర్యం చేసి తిక్కలేచినట్టుగా అడిగింది లచ్చవ్వ.

"ఊఁ ?" ముసుగు తీసి భార్యకేసి తీక్షణంగా చూశాడు నర్సయ్య.

ఆ కళ్ళల్లో ఏవేవో భావాలు, ఎన్నెన్నో భయాలు.

ఆ భాష లచ్చవ్వకు తెలియంది గాదు.

అతిక్రమిస్తే పర్యవసానం అనుభవించందీ కాదు. తిక్కగా వుంది.

"ఇండ్లనే సావున్రి పోరగాన్లార"

పిల్లల్ని యింట్లోకి నెట్టుకొచ్చి చాపలోకి విసిరిపారేసింది.

ఏడుస్తున్న సత్తెవ్వ చెంపలు పిండింది తల్లి. నోరు ముయ్యమంది. సత్తెవ్వ కిక్కురుమనలేదు. ఆ పక్కనే బతుకు మీది రోతతో విసుగ్గా ఒరిగింది లచ్చవ్వ.

బయట గాలి వీస్తున్నట్టుంది. తలుపు సందుల్లోంచి సన్నగా చల్లగాలి మొదలైంది. ఆ పిల్లగాలి కొద్ది క్షణాల్లోనే వేగం హెచ్చింది. ఉద్ధృతంగా వీస్తోంది. ఎక్కడో రేకులు బడబడమంటున్నాయి. దుమ్మంతా పైకి లేస్తోంది. దాంతో వాకిళ్ళలో పడుకున్నవాళ్ళు మళ్ళీ యిళ్ళలోకి వెళ్తున్నట్టున్నారు.

తలుపులు గాలికి అటూ యిటూ వూగుతున్నాయి. కిర్రుకిర్రుమంటూ గొళ్ళెం ఆపలేక మూలుగుతోంది. కొంత సేపటికి తలుపులు ఎవరో నెట్టినట్టుగా భడాల్మన్నాయి. నర్సయ్యకి కలత నిద్రలోంచి ఆకస్మాత్తుగా మెలకువైంది.

"ఆఁ ? అఁ. ఆఁహో. ఓహ్ఁ." ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు వేశాడు. గజగజ వణుకుతూ లేచి కూర్చున్నాడు నర్సయ్య.

లచ్చవ్వ విసుక్కుంది.

"ఏంలేదు. గాలి బాగా వెడ్తున్నది. చప్పుడు జేక పండు."

అయినా తృప్తి కలగలేదు. అనుమానంగా అటు యిటు చూశాడు నర్సయ్య. గాలికి దీపం ఎగురుతోంది. ఇంకాస్త వీస్తే ఆరిపోయేట్టుంది. తలుపులకేసి చూశాడు. గొళ్లెం సరిగ్గానే వుంది.

మళ్ళీ ఒరిగాడు నర్సయ్య.

పిల్లలు మెల్లిగా గాఢనిద్రలోకి జారుకున్నారు. లచ్చవ్వ క్కూడా కన్నంటుకుంది.

ఆకస్మాత్తుగా కేకలు విన్పించాయి. లచ్చవ్వ ఉలిక్కి పడింది. భర్తకేసి చూసింది. దీపం ఆరిపోయింది. నర్సయ్య "వోవో" అని బాధగా గింజుకుంటున్నాడు. కొన ఊపిరితో శ్వాసతో ఎగపోస్తున్నాడు.

"ఏంది ? ఏమైంది ?"

ఒక్క ఉదుటున భర్తని భయంతో కౌగిలించుకుంది. ఊపి ఊపి అడిగింది.

ఎక్కిళ్ళు పట్టినట్టుగా ఏడుస్తూ ఎగపోస్తున్నాడు నర్సయ్య. లచ్చవ్వకి అసలేం జరిగిందో అర్థం కాలేదు. హడలిపోయింది.

"ఏమైంది ?"

"ఎవలో మెడలుపట్టి పిసికిన్రు. కడుపుల గుద్దిన్రు. మొస ఆడకుంటయ్యింది."

లచ్చవ్వ కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. భయంతో భర్తని మరింత కరుచుకుపోయి పెనిమిటి మెడలు పుణికి చూసింది. నిజంగానే మెడపై రెండు మూడు గోళ్ళు గీరినట్టుగా గుర్తులున్నాయి. లచ్చవ్వ పై ప్రాణం పైన్నే పోయింది. భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

అలా జారిన చెయ్యికి ఏదో గరుకుగా తగిలింది.

"వాయ్యో, పాం పాం"

ఒక్క ఉదటున మంచంలోంచి ఎగిరి గంతేసింది లచ్చవ్వ.

నర్సయ్య గజగజ వణికిపోతూ కిందికి దుంకాడు.

ఆ అదురుకి నులక మంచంలోని రెండు పిడుకలు కిందపడ్డాయి.

వణుకుతూనే దీపం ముట్టించింది లచ్చవ్వ.

అటుకు మీంచి పిల్లి దడేల్మని కిందకి దూకింది. ఎలుకని నోట కరుచుకున్న పిల్లి వాళ్ళని చూసి భయంతో చెంగు చెంగున గెంతి పారిపోయింది.

ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ షాక్ నుంచి తేరుకున్నాక ఆ పిడకల్ని చేతిలోకి తీసుకుంది లచ్చవ్వ. మెడకు రాసుకొని చూసింది. గడ్డి తుక్కు. ఊక కలిపి మందంగా చేసిన పిడుక గరుకుగా గీరుకుపోయింది.

అవ్వల్ల. హమ్మయ్య. అని ప్రమాదం తప్పినట్టు నిట్టూర్చింది.

ఇల్లంతా భయంభయంగా కలియజూశాడు నర్సయ్య. మళ్ళీ ముసుగు తన్నబోయాడు.

లచ్చవ్వకి కోపం, బాధ హృదయాన్ని కలిచివేస్తున్నాయి. చర్రున దుప్పటి లాగేసింది.

"ఊఁ" పడుకో అన్నట్టు చూశాడు నర్సయ్య.

ఆ చూపుకి మరింత కోపం వచ్చింది లచ్చవ్వకి. ఏం మనిషి. అసలు మనిషా, పశువా? ముసుగు కప్పుకుంటే చాలా? ఇంట్లో వాళ్ల గురించి కించిత్త యినా రందిగా వుందా ? ఆడిదాన్ని. దిక్కులేని పక్షిలా అయిపోయింది బతుకు.

కోపమేఘాలకి అశక్తత చల్లగాలి దాకి కన్నీరుగా వర్షిస్తోంది.

"ఇట్ల భయపడుకుంట ఎన్నిరోజులు బతుకుడు ?"

ఆ మాటకి నర్సయ్య ఉలకడు పలకడు. మళ్ళీ ముసుగు తన్నబోయాడు. కింద కూలబడింది లచ్చవ్వ. ఏడుస్తోంది. రాగం తీయకుండా వెక్కివెక్కి ఏడుస్తోంది. కళ్ళు మూసుకున్న భర్త మొహాన్ని చేతుల్తో పట్టి వూపుతూ మళ్ళీ అదే అడిగింది.

"ఇట్ల ఎన్ని రోజులు ? చచ్చేదాక గిట్లనే రోజు సచ్చుకుంట బతుకుడా ?"

నర్సయ్య మౌనంగా ఉండిపోయాడు.

అతని మనస్సులో ఏవేవో నీలినీడలు దయ్యాల్లా భయపెడుతున్నాయి. ముప్పయి అయిదేళ్ళకే ఆఖరు గడియలు లెక్కపెడుతున్న వాడిలా వుంది స్థితి.

"మా తల్లి గారింటికి పోదాం. అక్కన్నే ఏదన్నా చిన్న దుకాణం పెట్టుకొని బతుకుదాం"

నర్సయ్య పెదవి విప్పలేదు.

"ఔ! ఏం మాట్లాడవూ?"

"ఈ వూరిడిసిపెడితే అందరికీ అనుమానం రాదా?"

గుడ్లు మిటకరించాడు నర్సయ్య.

"మరి యిగ ఎట్ల నీ తోటి ?"

లచ్చవ్వ హృదయంలోని దుఃఖం కళ్ళలోని కన్నీళ్ళుగా గొంతు దిగినట్టున్నాయి. గొంతు జీరబోయింది. రాగం తీగసాగుతోంది. ఏడుస్తూనే శపిస్తోంది.

"ఈ వూర్లె గింత భూమి గొను అంటె గన్ని పైసలెక్కడియి అని వూరోల్లు అనుమానపడుతరంటివి. పోనీ పోరగాన్లకు కొంచెం మంచి బట్టలు గొను అంటే గిదే మాటంటివి. ఇగ ఆ పనిజేసి సంపాయిచ్చిన పైసలు దేనికి! మనం జచ్చినంక బొందమీద కప్పనా?"

నర్సయ్య దగ్గర ఆ ప్రశ్నలకి జవాబు లేదు.

"ఔ! బొంబాయన్న, పట్నమన్న పోయి బతుకుదాం. అక్కడ గాకపోతే యింకెక్కడన్న బతుకుదాం."

బతుకుమీద ఆశతో దీనంగా అడిగింది లచ్చవ్వ.

"అక్కడ మాత్రం వాళ్ళు లేరా ? మనం ఎక్కడున్నా జాడదీసికొని వస్తరు."

"ఇగ ఎట్ల మరి ? ఈ పూట పూట గండం బతుకుడు యిగ నాతోని గాదు. నన్ను నిద్రల బండ ఎత్తేసి సంపు."

మరింతగా ఏడుస్తోంది లచ్చవ్వ.

ఆ మాటలు ఒళ్ళంతా సూదులు పెట్టి పొడుస్తున్నట్టుగా వున్నాయి. నిరాయుధ చిత్రహింస నర్సయ్యను నిలువునా అణువణువునీ చంపేస్తోంది.

కసిగా లేచాడు. దుప్పటిని కాల్తో తంతే పిల్లల మీద పడింది. పిల్లలు ఉలిక్కిపడి మళ్ళీ సర్దుకొని పడుకున్నారు.

తలుపు సందుల్లోంచి గాలి చల్లగా వీస్తోంది. కాని ముసుగు కప్పుకున్నప్పటి కన్నా ఎక్కువ ఉక్క పోస్తోంది నర్సయ్యకు. అది బయట నుంచి వస్తున్న ఉక్కకాదు. లోపల్నుంచి ఎగదన్నుకొస్తున్న ఉక్క కాబోలు. గతమంతా కళ్ళలో కదిలి ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది.

ఆనాటి కసి కోపమంతా యిపుడేమయిపోయిందో తెలియడం లేదు. అన్నీ అయిపోయి వొక్కటే మిగిలింది - ప్రాణ భయం.

కానైతే వాడు చావనూ చచ్చాడు. చచ్చేదాకా నిద్రపోలేదు తాను. వాడు చచ్చి తనని నిత్యం చంపుతున్నాడు. వాడు చస్తే ఏమిట్లోకి ఏమైందనీ, వాడి పార్టీ వాళ్ళు ఇంకా ఎందరో బతికే వున్నారు. ఒక్కడు పోతే పీడా పోతుందనుకుంటే యిపుడు వందలాది మందితో పీడ చుట్టుకుంది. ఇపుడు ఎవడు పళ్ళు నూరుతున్నాడో తెలియదు. ఎవడు నిజంగానే పలకరిస్తున్నాడో తెలియదు. చేతిలో చెయ్యి వేసినట్టే వేసి ఎపుడు ప్రాణం తీస్తారో తెలియదు. ఎవరు తీస్తారో అసలు తెలియదు. తనకి వాళ్ళ చేతుల్లో చావు మాత్రం తప్పదు. అది బ్రహ్మరాతగా నుదిటి మీద రాసిపెట్టి ఉంటే ఏం చేసీ లాభం లేదు. లేకపోతే ఏం చేసినా ఎన్ని చేసినా హాయిగానే వుండొచ్చు. ఎంతమంది అలా లేరనీ.

ఎకరం భూమికి ఆశపడితే ఎంత పనైపోయింది. అంతా తీరాక ఆ దొర ఎక్కడి ఎకరంరా అన్నాడు. తాను నోరు తెరవక తప్పలేదు. అయినా గుర్తుచేశాడు. భూముల్ని సంగం అమ్మనివ్వడంలేదు. కొననివ్వడం లేదు. నీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాళ్ళు నిన్ను వూళ్ళో బతుకనిస్తారని ఎట్లా నమ్ముతున్నావురా

అన్నాడు. బతుకు రెంటికి చెడ్డ రేవడి అయి నర్సయ్యకి తనమీద తనకే జాలిగా వుంది. తన మీద తనకే కసిగా వుంది. తన మీద తనకే అసహ్యంగా వుంది.

దుఃఖంతో కన్నీళ్ళని చేత్తో తుడుచుకున్నాడు నర్సయ్య.

లచ్చవ్వ బేలగా భర్తవైపు చూస్తోంది. ఆ చూపుల్లో ఎన్నో భావాలు.

ఏడవనీ, యింకా ఏడవనీ, రోజూ మమ్మల్నందరినీ ఏడ్పించడం లేదా? వాళ్ళ జోలికి ఎందుకు పోయినవు? వాళ్ళు మంచితనానికి ఎంత మంచోల్లు. ఇంత కోపం నీకెందుకు? మస్కట్ దుబాయి పోయిన రాజన్న పెండ్లాన్ని గుంజుతె ఊరుకుంటరా? అందరు ఒక్క తీరుంటరా ? ఇద్దర్ని వుంచుకొని యాడాద్దాక నన్ను తల్లిగారింట్లనే వుంచితివి. నిన్ను నన్ను కలిపిందెవలు. ఆ సంగపోల్లు గాదా! నిన్ను నడిమందిల రెండు చెప్పుదెబ్బలేస్తే నీ పరువు పోయిందా? నీకున్న పరువేంది అసలు. ఈ దొరకు ఆ దొరకు లంజెల్ను తార్చుడు గూడ నీ మొకానికి గొప్పపనిలా వుంది. ఇట్ల ఎంత మందిని అదిరిచ్చి బెదిరిచ్చి లంజల్ని చేసినవో ఎవలకెరుక? రాజన్న పెండ్లాం తోటి నీ సంగతి బయటపడ్డది. ఎన్నడన్న కష్టం చేసిన చెత్తనా (శరీరమా)? నేను తెచ్చిపోస్తే వున్నకాడికి ఎత్తుకపోయి తాగి తందనాలాడి దాన్తోని దీన్తోని సినిమాలు జూసుకుంట గట్ల పీతి బొత్త పెంచినవ్.

వాళ్ళు మంచితనానికి మంచోల్లు. చెడ్డతనం జరిగిందంటే రాచ్చసులకే రాచ్చసులసొంటోల్లు. యింట్ల ఎవలకు తెల్వకుంట ఎంత పని జేస్తివి. పైసలస్తయని ఆశపడ్తివి.

ఏమైపోయె యిపుడు ? ఆ వచ్చిన పైసలన్న తిన నోసుకోకపోతివి.

అలా యిద్దరూ మౌనంగా రోదిస్తూ ఒకర్నొకరు చూసుకుంటూ ఎంత సేపు కూర్చుండిపోయారో తెలియదు.

చివరకు లచ్చవ్వే నిర్వేదంగా నోరు తెరిచింది.

"ఆ అమీను సర్కిల్ సాబులను కలిసి ఓ పిస్తోలు యిప్పియ్యమని అడుగు మరి"

నర్సయ్యకి ఆ మాట బాగా నచ్చింది. దుఃఖం ఒక్క క్షణంలో ఎటో ఎగిరి పోయింది. అవును. అదే సరయిన మార్గం. ప్రస్తుత పరిస్థితుల్లో అది తప్ప మార్గం లేదు. తన కోసం సెక్యూరిటీ గార్డుల్ని పెట్టినా లాభంలేదు. వాళ్ళ తిండి

ఖర్చులు తానెక్కడ భరించగలడు? ఒక రివాల్వర్ అయితే అన్నిటికీ సౌలభ్యంగా వుంటుంది. అది ప్రాణాన్ని రక్షించినా రక్షించకపోయినా తనకు ఎంతో ధైర్యం. అయినా అది వుండగా ఆ లంజకొడుకులకి తన దగ్గరికి రావడానికి ఎంత ధైర్యం?

కొంచెం హుషారొచ్చింది నర్సయ్యకి. లేచి తలుపు దీసుకొని ఒంటేలుకు వెళ్ళాడు. అటుయిటు చూశాడు.

నిర్భంధంలా వెన్నెల అంతటా యింకా పరుచుకుంటూనే వున్నది. గాలి చల్లగా తాకింది. చెమటకాయ పర్రపర్ర గోకాడు.

ఔను. ఉదయాన్నే లేచి వెళ్ళాలి. ఎస్సై సర్కిల్లను కలువాలి.

తలుపులు బిడాయించుకున్నాడు నర్సయ్య. కొంచెం గుండె దడ తగ్గింది. వెంటనే కన్నంటుకుంది. లచ్చవ్వ ఏడ్చి ఏడ్చి అలా మంచం కోడు మీదే తల ఆన్చి నిద్రపోయింది.

❄ ❄ ❄

జగిత్యాల్లో ఉదయం తొమ్మిది గంటల్నుంచి ఎదిరి చూస్తున్నాడు నర్సయ్య. ఎస్సైని, సి.ఐ.లు ఎటో వెళ్ళినట్టున్నారు. ఇంకా రాలేదు. ఎదిరిచూసి చూసి కళ్ళు నొప్పి పుడుతున్నాయి. రాత్రి తొమ్మిదయిపోయింది. అంతలో జీపు చప్పుడు వినిపించింది.

అందులోంచి కావాల్సిన వాళ్ళు దిగారు. వాళ్ళు తిరిగి తిరిగి బాగా అలసిపోయారు. చూస్తూనే పలకరించాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

"ఏం నర్సయ్యా? ఎటో వచ్చినవు?"

అందులో రెండర్థాలు విన్పించాయి. గతుక్కుమన్నాడు నర్సయ్య. ఈసారి వచ్చిన పని తనది. కనుక ఆ మాట అంతరార్థం అర్థం కానట్టుగానే మొహం పెట్టాడు. రెండు చేతులు జోడించాడు. వచ్చిన పని వివరించి మళ్ళీ చేతులు జోడించాడు.

"ఇగ అంతా మీదయ సార్. ఎట్లనన్న జెయ్యుని"

సర్కిల్ మూడ్ బాగాలేదు. అసహనంగా చూశాడు. "లంజ కొడుక. ఓ

నెలరోజులు లాకప్‌లేసి గుద్దంత మండంగ జోపితే గానీ నీ రాకపోకలు తగ్గేట్టులేవురా. లేకపోతే ఏందిర? నువ్వెంత నీ బిషాదెంత? వూరపిచ్చుక లంజకొడుక. నీకు రివాల్వర్ కావాల్నారా?

చావు. లంజా కొడుకా చావు. మేం చస్తలేమా రోజూ ? అదిగో చూడు. పౌరహక్కుల సంఘం లంజకొడుకులు ఎట్ల జేస్తున్నరో చూడు. ఆలిండియా మేధావులు, జర్నలిస్టుల్తో నిర్బంధం ఉన్న ఏరియాల్లోకి టూర్ ఏర్పాటు చేస్తున్నరంట. వాళ్ళు వచ్చేదెంతో వచ్చి పత్రికల్లో రాసి చచ్చేదెంతో గాని మినిష్టరు, కలెక్టర్లకాన్నుంచి పల్లెలవెంట ఎట్ల తిరిగి చస్తున్నరో చూడు. నువ్వొకడివేనా చస్తున్నది?

అసలు ఎవడికోసంరా చచ్చేది? ఈ మినిష్టరు, కలెక్టరు, ఎస్పీ గూడ నీ తీర్గనే దేశసేవ చేస్తున్నారట. నా లంజాతులు. ఎన్ని నీతులు జెప్పిన్రు ఈ రోజంత? నన్ను ఎన్ని తిట్లు తిట్టిన్రు! అది గూడ అందరిముందు మీటింగ్ పెట్టి. మరి కొట్టకపోతే తన్నకపోతే పైసలెట్ల వస్తయంట?

ఈ ఎస్పీగాడు గూడా తానేదో పతివ్రతన్నట్టు మాట్లాడుడేనాయె. ప్రతి నెల అయిదు వేలు దొబ్బుడు ఏనాడు తప్పిందనీ! మల్ల గిట్ల తిట్టుడు బరాబరే. టూర్ అంట పెట్టి ఏరియా అంత తిరిగిరి. చిలుక పలుకుల ఉపన్యాసాలు దంచిరి. మల్లో పదిహేను రోజుల్దాక ఈ ఏరియాల నూర్రూపాయలు కాదు గదా నాకు ఉప్పుగూడ పుట్టకుంట జేసిరి. మల్ల అయిదో తేదీకి ఒక్కరోజు దాటితే చాలు. ఎస్పీ కేంది వైర్లెసు యింట్లనే ఉండె. వానిదేం పోయిందట. అదంతా సరే మరి గసొంటి లంజకొడుకుల్ని ఎవడు మేన్‌టేన్ చేయాల్నట! ఆగు బిడ్డా వీన్ని నీ దగ్గరికే తోలేస్తాగు!"

అంత కోపంలోనూ ఎందుకో బాగా తమాయించుకున్నాడు సర్కిల్. చాలా శాంతంగా. యిందాక పొద్దంతా మాట్లాడిన కలెక్టర్ గొంతులా మార్చాడు.

"నర్సయ్యా! అది మా చేతుల పనిగాదయ్యా! ఎస్పీగారిని కలువు. కలిసి నీ గోడును చెప్పుకో. ఎస్పీ సాబు మల్ల మాకు రెఫర్ చేస్తడు. నేను తప్పకుంట రెకమెండ్ చేస్త. గదేం ఫికర్ పెట్టుకోకు. నీకు మాత్రం తెల్వనిదేముంది చెప్పు. రివాల్వర్‌గానీ ఏదిగానీ కలెక్టరే గద మంజూరు చేయాల్సింది."

ఎంత బతిమాలినా చివరకు కాళ్ళు పట్టుకున్నా అంతకన్నా ఎక్కువ హామీ

రాబట్టలేకపోయాడు నర్సయ్య. నర్సయ్య ఎపుడు వదుల్తాడా అన్నట్టుగా వుంది ఎస్సయికి. నర్సయ్యకి అది చావుబతుకుల సమస్యాయె. మళ్ళీ మళ్ళీ సాగదీశాడు.

"అయ్యా! పని ఒడ్డెక్కెదాక ఒకతీరు మాట్లాడిన్రు. పని ఒడ్డెక్కినంక గిట్ల చేస్తున్నరు."

ఎంత సేపటికీ వదిలేట్టు లేడు నర్సయ్య.

లేని ఓపిక తెచ్చుకొని సర్కిల్ మళ్ళీ అదే చెప్పాడు. మరో సలహా యిచ్చాడు.

"నువ్వు ఎస్పి దగ్గరికి ఒక్కనివి ఎట్ల పోతవు? ఏమని పరిచయం చేసికొంటవు? నీ పని నిజంగనే కావాల్నంటే ఓపని చెయ్యి. సత్యనారాయణా రావు (రావు) సాబును కలువు."

అయినా వదల్లేదు నర్సయ్య. సర్కిల్‌కి ఒక్కసారిగా తిక్కరేగింది.

"ఏందిర లంజకొడుక? పోలీసుల మాటను ఎవడు నమ్మమన్నడుర? లంజకు పెట్టిన పైస గోడకేసిన సున్నం మల్ల వాపసు వస్తాయిరా! ఎక్కువ మాట్లాడితివంటె నువ్వే యిన్ఫర్‌మేషన్ యిచ్చినవని లీకవుట్ చేస్త. గెటవుట్."

ఊహించని జవాబుకు నర్సయ్య తల దిమ్మెక్కిపోయింది. గజగజ వణికి పోయాడు. ఆ పని మాత్రం చేయకండని మళ్ళీ కాళ్ళపై పడ్డాడు. దాంతో సర్కిల్‌కి ఆయువుపట్టు దొరికింది. మలంలోని పురుగులా అసహ్యంతో అదే బూటుకాలితో విసిరితన్నాడు సర్కిల్. వెల్లకిల పడిపోయాడు నర్సయ్య. పై పన్ను కదిలినట్టుంది. నెత్తురు కారుతోంది. ఎలాగో శక్తిని కూడదీసుకున్నాడు నర్సయ్య. అప్పటికి ఎస్సై సిఐలు గదిలో దూరిపోయారు.

❄ ❄ ❄

ఎండ మండిపోతోంది. జగిత్యాల్లోని జమ్మిగద్దె రోడ్ నిర్మానుష్యంగా ఉంది. అప్పుడొకరు యిప్పుడొకరు వడివడిగా పరిగెడుతున్నారు.

చాలా సేపట్నుంచి నర్సయ్య ఆ గేటు ముందు తచ్చాడుతున్నాడు. అది సత్యనారాయణరావు బంగళా. అది పెద్ద రాజకీయ నాయకుడి పాత బంగళాలా ఉంది. గేటు ముందు యిద్దరు మనుషులు కాపలా కాస్తున్నారు. వాళ్ళు ఆ గేటు వద్దే కాకుండా ఆ రోడ్డంట వెళ్తున్న ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఎప్పుడు ఎవరు మీద పడతారో తెలియదని సత్యనారాయణరావు స్వయంగా ఏర్పాటు చేసుకున్న సెక్యూరిటీ ఏర్పాట్లవి.

నర్సయ్యకీ సత్యనారాయణరావుకు గల సంబంధం అతి రహస్యమైంది. ఎంత రహస్యమైందంటే రావు సెక్యూరిటీ బృందంలో కూడా చాలామందికి తెలియదు.

రావుకి యిలాంటివి నిర్వహించడంలో గొప్ప ప్రజ్ఞ ఉంది. తాను కనపడకుండా తెరమీద వ్యక్తుల్ని ఆడించడంలో ఆరితేరిన ఘనుడు. తాను యిచ్చిన సలహాల వల్ల నష్టపోయినవాళ్ళు కూడా అతని మాట వినడం ఆయన ప్రత్యేకత. కాంగ్రెస్‌కి గాంధీలా అనేక సంస్థలకి ఏ పదవీ లేని నాయకుడాయన. లయన్సు క్లబ్బా, రోటరీ క్లబ్బా, 'శాఖ', పరిషత్తు, కంట్రాక్టర్ల సంఘం, భూస్వాముల సంఘాలకి సంబంధించిన పనులెన్నో ఆయనమీద పడుతుంటాయి.

ఆయన సొంత పనులు సరేసరి. ఎన్నో వ్యవహారాలాయె. ఎటు వెళ్ళాడో తెలియదు. నర్సయ్యకి చూసి చూసి విసుగొస్తోంది. ఎండకి శరీరం పెనం మీద రొట్టెలా మాడిపోతోంది. గొడుగు లేదు. ఏమీలేదు. విసుగు మరిచిపోవడానికి రోడ్డంట వెళ్తున్న వారికేసి చూస్తున్నాడు. అక్కడికి తూర్పున కిలోమీటరు దూరంలో తాటిచెట్లున్నాయి. ఎవరో గౌడు ఒక నిద్ర తీశాక యింటికి బయలుదేరినట్టున్నాడు. కావడికి యిటువేపు కల్లుకుండ నురగలు కక్కుతోంది. అటువేపు తాటిముంజల గెల వేలాడుతోంది. అది చూడగానే దాహం గుర్తొచ్చింది. బాగా దాహంగా వుంది. ఏదైనా హోటల్ కన్పిస్తుందేమోనని అటూ యిటూ చూశాడు.

ఇంతలో చూసి చూసి విసిగిపోయిన గార్డు చటుక్కున వెనకనించి వచ్చి మెడమీద చెయ్యివేశాడు.

"ఏ ఊర్రా లంజకొడుకా? అద్దగంటనుంచి నాసు వెడ్తున్నవ్." అంటూ ఒక చెయ్యి వెనక్కి విరిచాడు. ఏదో చెప్పబోయాడు నర్సయ్య. భయంతో నోరు పెగల్లేదు. అంతలోనే ఏదో ధైర్యం. ఈలోగానే ముడ్డిమీద మోకాల్తో పొడుస్తూ గేటు లోపలికి తీసుకుపోయాడు గార్డు.

ఆ బంగళా బూత్‌బంగళాలా వుంది. ఎటో ఎటో తిప్పాడు. చివరికి ఒక చీకటి గదిలో బంధించాడు గార్డు.

ఇంకా సాయంత్రమైనా కాలేదు. కాని గదంతా చిమ్మచీకటి. అనుకోని హఠాత్పరిణామానికి వణికిపోయాడు. నాలుగు గోడలు తడిమి చూశాడు. ఒక్కగూడు గానీ కిటికీ గాని లేవు. కరెంట్ స్విచ్‌గానీ వైరింగ్ గానీ ఎక్కడా అందలేదు.

ఉక్కపోస్తోంది. గదంతా మూత్రం వాసనతో పాటు ఏదోరకం వాసన వేస్తోంది. శ్వాస బంధించబడినట్టుగా వుంది. ఊపిరి సలపడంలేదు. నిలబడి నిలబడి నిస్సహాయంగా కింద కూలబడిపోయాడు.

ముడ్డికింద ఏదో గరుగ్గా గుచ్చుకుపోయింది. చేత్తో తీసి అటూ యిటూ తడిమాడు. అది ఎండిన పలుచని పిడుకో, బ్రెడ్డుముక్కో తెలియడం లేదు. ఆకలిగా కొరికి చూశాడు. ఎండిపోయిన మలం నాలికని అసహ్యం చేసింది. తుప్ప తుప్ప ఉమ్మాడు. నీళ్ళతో పుక్కిలించాలని వుంది. ఎవరివ్వాలి? ఇది సత్యనారాయణరావు స్వయంగా నడిపిస్తున్న లాకప్ గది అని తెలిసిపోతూనే వుంది. ఎన్ని రోజులు ఎంతమందిని వుంచారో తనకు చూచాయగా తెలుసు. తనకు ఎన్ని రోజులకి మోక్షమో తెలియదు. నాలుక పిడచగట్టుకుపోతోంది. 'దొరా' అంటూ బిగ్గరగా బాధగా పిలిచాడు. ఆ శబ్దం గదిలోనే గింగిర్లు కొడుతోంది.

ఎంతసేపయిందో తెలియదు. తనమీద తనకే కోపంగా వుంది. తనని తాను చంపుకోవాలన్నంత కసిగా వుంది. కరెంటు తీగల కోసం మరోసారి గదంతా పుణికాడు. ఉహూ౦ లాభంలేదు. వాళ్ళు యివన్నీ ముందే వూహించినట్టున్నారు.

తనమీద తనకే జాలి దుఃఖం కలిగాయి. ఏడ్చి ఏడ్చి ఆ మలం పిడుకల్లోనే అలాగే ఒరిగిపోయాడు. ఎపుడు మగత కమ్మిందో.

లేచి కూర్చొని ఆ పిడకల్ని ఎడం చేత్తో ఒక వైపుకి ఊడ్చాడు. నాపరాళ్ళకి అంటుకుపోయింది. కొంత అంటుకుపోయి రావడం లేదు. పనిలేని పని. ఏపని చేయకపోతే పిచ్చెత్తేట్టుగా వుంది.

ఎంతో సేపటికి జీపులు ఆగిన శబ్దం లీలగా వినిపించింది. అప్పుడు తెలిసింది నర్సయ్యకి. ఆ గదిలో శబ్దం సైతం బయటకు పోదన్నమాట. నీరసంగా మూలిగాడు.

కొద్దిసేపటికి గదిలోకి రూపాయి బిళ్ళంత వెలుగు ప్రసరించింది. అది అటుయిటు వెతుకుతోంది. చీకట్లో గోడకి నక్కాడు. నర్సయ్య. తలుపుకున్న పావలా బిళ్ళంత రంధ్రం లోంచి వస్తున్న వెలుగుకి అందలేదు నర్సయ్య.

కొంతసేపటికి తలుపులు తీశారు.

దర్వాజాకు ఇరువైపులా యిద్దరు సాయుధులున్నారు. వారి చేతుల్లో గన్స్ పేలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరొకడు నర్సయ్య రెండు చేతుల్ని వెనిక్కి విరిచి పట్టుకున్నాడు. రైఫిల్ బట్‌తో వెన్నుమీద ఫట్‌ఫట్‌మని రెండు పిడిగుద్దులు గుద్దాడు. అమ్మో అని అరవబోయాడు నర్సయ్య. దాంతో ముడ్డిమీద మోకాల్తో తన్నాడు. అలా తన్నుకుంటూ పొడుచుకుంటూ ఎటో తీసుకుపోయారు.

కొంతదూరాన లైట్లు కనిపించాయి. ఆ తర్వాత వరండాలోకి తీసికెళ్ళారు. దానికానుకుని సత్యనారాయణరావు ఆఫీసురూం ఉంటుంది. అది నర్సయ్యకు తెలుసు.

ట్యూబ్‌లైటు వెలుగులో రివాల్వింగ్‌చేర్లో మత్తుగా జోగుతున్నాడు సత్యనారాయణరావు. రైఫిళ్ళ శబ్దం విని సుతారంగా కళ్ళు తెరిచాడు. ఆశ్చర్యం! నర్సయ్య. నర్సయ్య అందులోకి ఎలా చేరాడు ?

గార్డులకు కనుసైగ చేశాడు రావు. వాళ్ళు బయటికి నడిచారు. వెంటనే రివాల్వర్ లోడ్ చేసి సరిచేసిన శబ్దంలా విన్పించింది. గజగజ వణికిపోయాడు నర్సయ్య. స్ప్రింగ్ డోర్ క్లిక్‌మని మూసుకున్న శబ్దమది.

కూర్చో అన్నట్టు కుర్చీ వేపు చూశాడు రావు. అవమానభారంతో అలాగే కూలబడిపోయాడు నర్సయ్య.

ఎలా జరిగిందని రావు అడగలేదు. ఇలా జరిగిందని నర్సయ్య చెప్పనూ లేదు. ఎవరూ చెప్పకుండానే వారిద్దరికీ అంతా అర్థమైనట్టే వుంది. మర్యాద ఉట్టిపడే కంఠంతో ఆప్యాయంగా పలకరించాడు రావు.

"ఎప్పుడొచ్చినవు? ఏం సంగతి?"

తాను బయల్దేరిన పని, జరిగిన సంగతి వివరించాడు నర్సయ్య.

భుక్తాయాసంతో ఒళ్ళంతా వూపుతూ తలవూపాడు రావు.

రావు మనస్సులో ఏవేవో వూహలు కదలాడాయి. తను యింత క్రితమే ఎస్పి తదితరుల్తో ఉల్లాసంగా మాట్లాడి తినివస్తున్నాడు. కాని ఆ కులం తక్కువ వెధవ గౌడుని చూస్తుంటే వాడికి అబ్బిన అట్టహాసం చూస్తుంటే ఒళ్ళంతా తేళ్ళు జెర్రులు పాకినట్టుగా వుంది. వెధవ లంజాకొడుక్కి ఎంత నీలుగుడు. చాటుగా ఎస్పికి చెప్తే తనకు తెలియదనుకున్నాడో! అన్‌లైసెన్సుడు ఆయుధాలు హాండోవర్ చేసికొమ్మంటాడు. మినిష్టర్ అయినంత మాత్రాన గవర్నమెంటంటే వీడి తాత జాగీరనుకున్నాడో. మళ్ళీ ఓసారి ఎస్పితో వివరంగా మాట్లాడాలి. వినకపోతే విద్యాసాగర్రావు వుండనే వున్నాడు. అసెంబ్లీలో కంపుకంపు చేయించాలి. విన్నాడా సరేసరి. వీడు - నర్సయ్యగూడా తన బేరానికి సరిగ్గా సమయానికి పిలిచినట్టే చేరవచ్చాడు.

"ఎస్పితో నాగ్గూడా కొంచెం పని వుంది. రేప్పొద్దునే పోదాం. ఇక్కడ్నే అవతలి వరండాలో పండుకో. అన్నట్టు భోంచేసినవా ?"

ఆ ఆప్యాయతకి పులకరించిపోయాడు నర్సయ్య. లాకప్పుల్నే వుంటి ఎపుడు తింటి అని అడుగాలని కూడ తోచలేదు.

సంతోషంగా 'లేదని' తలవూపాడు నర్సయ్య.

"కృష్ణా" అంటూ పిలిచాడు రావు.

కృష్ణ వెంట కొంచెం హుందా చూపే హోదాలో నడిచాడు నర్సయ్య.

కమ్మని తిండి కడుపు నిండా తిన్నాడు. భుక్తాయాసంతో వరండాలోని కార్పెట్‌పై ఒరిగాడు నర్సయ్య. ఎస్పి మీద నమ్మకంతో హాయిగా నిద్ర పట్టేసింది.

❄ ❄ ❄

## 2. ఊబిలో అయస్కాంతాలు

కరీంనగర్ ఎస్పి ఆఫీసులో సీలింగ్‌ఫ్యాన్ నిశ్శబ్దంగా తిరుగుతోంది. టేబిల్ మీద ఫైళ్ళలోని కాగితాలు గాలికి అల్లల్లాడుతున్నాయి. ఈ రోజు ఎస్పికి మూడ్ చాలా ఫ్రెష్‌గా వుందేమొ. అదీ యిదీ మాట్లాడుతున్నాడు. ఇంటెలిజెన్సు ఎస్పికి కూడా అలాగే వున్నట్టుంది.

ఫోన్ మోగుతోంది. నిర్లక్ష్యంగా దాన్ని ఎవరూ ఎత్తడం లేదు. చర్చ అంత

రసకందాయకంగా సాగుతోంది మరి. సి.సి.కి ఎక్స్‌టెన్షన్ బటన్ నొక్కాడు. ఫోన్ మూగవోయింది.

"అయితే మీరే డిపార్టుమెంటు కోసం ట్రై చేస్తున్నారు ?" ఇంటెలిజెన్సు ఎస్పి కళ్ళలోకి ఆసక్తిగా చూస్తూ అడిగాడు ఎస్పి.

జవాబుగా చిరునవ్వు నవ్వాడు ఇంటెలిజెన్సు ఎస్పి. ఆ నవ్వులో ఎన్ని అర్థాలైనా వున్నాయి. 'అది కాన్ఫిడెన్షియల్. చెప్పేస్తే మీరు కూడా కాంపిటీషన్‌కి వస్తారేమో. నా పైరవీ లీకయితే మీరే సక్సెస్ అయ్యే ప్రమాదముంది. ఎంతయినా మీరు సివిల్ ఎస్పి కదా. పరిచయాలు పరపతి చాలా ఎక్కువ.'

నువు చెప్పకపోతేనేంలే అన్నట్టు మారునవ్వు నవ్వాడు ఎస్పి. నవ్వుతూనే ఏదో ఆలోచిస్తున్నాడు. యాంటీ కరప్షన్ బ్యూరోకి గానీ, ఆల్విన్‌కి గానీ ట్రై చేయాలి. యాంటీ కరప్షన్ బ్యూరో లోనైతే ఏ రిస్కూ వుండదు. గవర్నమెంటు అఫిషియల్స్ అంతా గజగజలాడుతారు. ఆదాయానికీ లోటుండదు. రాజకీయ నాయకులక్కూడా పక్కబెదురులా వుంటుంది. ఎవడైనా సరే నవ్వుతూ పువ్వుల్లో పెట్టియిస్తారు.

ఇక ఆల్విన్లో అయితే యింకేం కావాలి తనకి. పైసా పెట్టుబడి లేకుండా కోట్ల పెట్టుబడికి మేనేజింగ్ డైరెక్టర్ పేరిట యజమాని అయిపోతాడు. ఏటా లక్ష ల్లక్షలు. మూడేళ్ళుంటే చాలు. ఇక వుద్యోగానికి రాజీనామా పడేసినా, లాంగ్‌లీవులో వెళ్ళినా అడిగేవాడెవ్వడు? ఆలోగా తానే నిలదొక్కుకుంటాడు.

అసలా బావగారు సహకరిస్తే ఈపాటికే ఇద్దరం బాగుపడిపోయే వాళ్ళం. తిక్కమనిషి, రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి లెక్చరర్ గిరీ వదలడు గదా. వదిల్తే ఈ పాటికి పెద్ద యిండస్ట్రీ పెట్టించకపోదునా? వారు అలా అలా రాజకీయాల్లోకి దిగితే మినిస్టరు కావడం ఎంతసేపు. ఎవడి కాళ్ళో పట్టుకోవడం కన్నా బావ కాళ్ళు పట్టుకున్నా పుణ్యమూ పురుషార్థమూ. కాని సహకరించడాయె. తన దారి తనదీ. ఆయనదారి ఆయనదీ. ప్చ్.

ఇలా ఒంటరిగా ఈ డిపార్టుమెంటులో ఎంత కాలం నెట్టుకురాగలడనీ. మార్క్‌ఫెడ్‌కో, ఆర్టీసీకో వెళ్ళాలంటే బావగారు రాజకీయాల్లో దిగి వుంటే ఇంత టైం కావాలా? ఛ.వెధవ కాంపిటిషన్. ఈ వెధవ ఐ.ఏ.యస్. కేడర్ ఒకటి.

ప్రతిదానికీ మేమే అంటూ వస్తారు. సింగరేణి కోల్‌మైన్స్ మొదలుకొని.. అబ్బబ్బ! ఎన్ని డిపార్టుమెంట్లని ఆక్యుపై చేశారూ!'

ఆలోచనల్లోనే కాఫీ బిస్కట్లు వచ్చినట్టున్నాయి. రెండు బిస్కట్లని కలిపి కరకర నములుతూ మనసులోని మాట పైకే కక్కేశాడు ఎస్పి.

"మరీ యిదిగా.. ఈ ఐ.ఏ.యస్. వాళ్ళు మనకి ప్రతిదానిలో కాంపిటీషన్ రావడం ఏం బాగాలేదండి. అన్ని డిపార్టుమెంట్లు వాళ్ళవే. మనకున్న కొద్దిపాటి ఛాన్సెస్ కూడా మళ్ళీ కాంపిటీషన్ కొస్తారు."

ఆ అభిప్రాయం తప్పన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు ఇం.ఎస్పి. సుతారంగా కాఫీ సిప్ చేస్తూ ఉత్సాహంగా కాళ్ళూపాడు.

"పాపం. ఎక్కడండీ వాళ్ళని మనవాళ్ళు బతకనిస్తున్నదీ! జిఏడీ, సెక్రెటేరియట్, డిపార్ట్‌మెంట్ డైరెక్టరేట్స్, రెవెన్యూ ఎట్సెట్రా డిపార్టుమెంట్స్ తప్ప ఎందులో వున్నా మనవాళ్ళు (ఐపియస్) ఎక్కడ వదుల్తున్నారని? రాజకీయ నాయకుల లూప్‌హోల్స్ అన్ని మన చేతుల్లోనే గదా వుండేది. మనవాళ్ళ మాట వినకుండా ఎవడైనా బతికి బట్టకట్టగలడేంటి ?"

అదీ నిజమే. అవునన్నట్టుగా నవ్వుతూ తల వూపాడు ఎస్పి. సి.సి. ఎక్స్‌టెన్షన్ ఫోన్ సున్నితంగా పిలుస్తోంది. రిసీవర్ ఎత్తి రెండు ముక్కల్లో ఆర్డరు పారేశాడు. ఇంజెస్పీని మళ్ళీ అడిగాడు ఎస్పి.

"అదిసరే. ఆ విషయం మధ్యలోనే పోయింది. అసలా ఇష్యూ పైన మీరు స్పెషల్ స్టడీ చేశారు కదా. వరల్డ్‌వైడ్ రెవల్యూషన్స్‌కి సంబంధించి అంత పెద్ద లైబ్రరీ మేన్‌టేన్ చేస్తున్నారు కదా. పైపెచ్చు ఫారెన్లో స్పెషల్ ట్రైనింగ్ చేసొచ్చారు. ఇంతకీ 'వాళ్ళు' వాటిని యింప్లిమెంట్ చేస్తారంటారా?"

ఇంజెస్పి ప్రశ్నార్థకంగా చూశాడు. 'ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం గదా! మీరడుగుతోంది ఏ విషయం గురించి?' అన్నట్లు మెదట్లోకి చూపు పోనిచ్చాడు.

"అదే. 'వాడి' వద్ద దొరికిన డైరీలో నా పేరు టార్గెట్లో వున్న విషయం గూర్చి"

సన్నగా చిరునవ్వు నవ్వాడు ఇంజెస్పి. ఎస్పికి అది వెన్నుపూసలో తాచుపాము జొరబడినట్టుగా వుంది.

"అందులో బెనిఫిట్ ఆఫ్ డౌట్‌కి స్కోప్ ఎక్కడుంది ? వాళ్ళు యిలాంటి మ్యాటర్స్‌లో ఎంత డిసిప్లిన్ పాటిస్తారో మీకు మాత్రం తెలియదా?"

ఎస్పీ కడుపులో మండుతోంది. వెధవది వీడి ముందు బయటపడాల్సింది కాదు. ఎలా ఎద్దేవా చేస్తున్నాడో చూడు. అయినా తన కదేమీ లెక్కలేనట్టుగా సిగరెట్ ముట్టించి హుందాగా పొగవదులుతూ నిర్లక్ష్యంగా అన్నాడు.

"ఎనీహౌ! కక్ష సాధింపు తప్పదంటారు."

మళ్ళీ దొరికిన ఛాన్సు వదుల్తాడా ఇంజెస్పి. మరింత వ్యంగ్యంగా నవ్వాడు.

"మల్కాన్‌సింగ్, పూలన్‌దేవిలను చూడండి. వాళ్ళు యెంత క్రూరంగా ప్రవర్తిస్తారో తెలుసుగా! ఏ సిద్ధాంతం లేని వాళ్ళే శత్రువుల పట్ల అంత క్రూరంగా ఉంటే సిద్ధాంతాల కోసం ప్రాణాలిచ్చే వీళ్ళు యింకెంత క్రూరంగా వుంటరో అంచనా వేయండి. అసలు వాళ్ల అంచనా ప్రకారం ఆ మొత్తం దండకారణ్యం, ఆ గోదావరి లోయప్రాంతం వాళ్ల హేండోవర్ అయిందనుకోండి. అసలా పరిస్థితి ఊహించండి."

"కన్పించిన లంజకొడుకునల్లా షూట్ చేస్తే సరి."

పండ్లు కొరికాడు ఎస్పి. అది ఎస్పి హుందాకి తగినట్లుగా లేదు. ఎస్పి డ్రెస్సు వేసుకున్న భూస్వామిలా వున్నాడు. కాని ఇంజెస్పి ఆ మాత్రం కూడా తొణకలేదు. అదే వ్యంగ్యం. వెన్నుపూస వణికించే అదే చిరునవ్వు.

"ఫ్రీ అండ్ ఫ్రాంక్‌గా చెప్పుకోవాలంటే అది మన తరం గాదు. ఇప్పుడు వాళ్ళు కొన్ని ప్యాకెట్స్‌లోనే వున్నారు గదా! అయినా ఏం చేయగలిగాం? అరవై మందిని చంపారు. అందులో హార్డ్‌కోర్ ఎంత మందనీ? పాతిక్కూడా ఉండరు. ఉత్తపుణ్యానికి మిగతా వాళ్ళని చంపారు. ఎంత న్యూసెన్స్ అవుతోంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ దాకా వెళ్ళింది. రేపు వీళ్ళు ఇంకా విజృంభిస్తారు. ఏం చేయగలం? నాకున్న జ్ఞానం సరైందయితే యిది నిజం కావచ్చు. రేపు వాళ్ళు దండకారణ్యం ప్రాంతాన్నంతా ప్రత్యేక గిరిజన రాష్ట్రం కావాలని కోరుతారనుకోండి. ఏ బేస్‌మీద స్టేట్‌గానీ, సెంటర్‌గానీ ఎలా వ్యతిరేకిస్తుందో నాకు మాత్రం తెలియదు.

ఎంతమందిని చంపుతారో నాకు తెలియదు. అలా చేస్తే స్టేట్‌పవర్‌కి అసలు లెజిటమసీ ఉంటుందాని? లెజిటమసీ కోల్పోవడం జరిగిందంటే అర్థం. అంతర్యుద్ధంలో ఓడిపోయే దశకొచ్చామన్నమాటే."

ఎస్పి అసహనంగా కదిలాడు. ఫ్యాన్ తిరుగుతున్నా చిరుచెమటలు పట్టాయి.

"అసలు వీళ్ళు మీ అంచనాల ప్రకారం ఎప్పుడు అధికారంలోకి వస్తారంటారు?"

ఇంజెస్పి ఆలోచనలో పడ్డాడు. సిగరెట్ వెలిగించాడు. ఓసారి ఫైళ్ళకేసి, ఓసారి ఫ్యానుకేసి చూశాడు.

"అఫ్‌కోర్స్, పధ్నాలుగు నుండి పద్దెనిమిదేళ్ళు, ఈలోగా మూడో ప్రపంచ యుద్ధం గనక స్టార్టవుతే యిది యింకా ముందే జరగొచ్చు."

ఎస్పి సాలోచనగా అన్నాడు. "సో, నౌ మై ఏజ్ ఈజ్ ఫార్టీటూ. ఔనూ మన ఐ.పి.యస్. అగ్రిగేట్ లైఫ్ ఏజ్ ఎంత?"

"ఫిఫ్టీ సిక్స్ టు ఫిఫ్టీ నైన్"

తృప్తిగా ఊపిరి పీల్చాడు ఎస్పి.

"అయితే అప్పటికి నేను కొంచెం ముందూ వెనకా నేచురల్ డెత్ అవ్వాల్సిందేగా! అయితే ఫరవాలేదు!"

"ఆ దృష్టితో ఆలోచిస్తే పప్పులో కాలేస్తారు. ఆ మాటకొస్తే మనం చచ్చినా మన శిక్ష యింప్లిమెంట్ చేస్తారు. అఫ్‌కోర్స్ మన పిల్లల మీద"

"ఆఁ"

"మన పిల్లలు రెండో శ్రేణి పౌరులుగా చూడబడతారు. టెన్ ఫిఫ్టీన్ యియర్స్ దాకా అబ్జర్వేషన్‌లో వుంచుతారు. స్కూల్, కాలేజ్, జాబ్ ఎక్కడున్నా ఎందులో వున్నా అంతే. అదిగో యిది అదే సంతతి అని ఎద్దేవా చేయబడతారు. జస్ట్ లైక్ సోషల్ బాయ్‌కాట్ ఉడ్‌బి ఇంప్లిమెంటెడ్ అఫ్‌కోర్స్. మన పిల్లలకి అందర్లాగే అన్ని సౌకర్యాలుంటాయి. బట్ కెన్ యు సే ద జెయిల్ ఇన్మేట్స్ ఆర్ ఫుల్ ప్లెడ్జ్‌డ్ సిటిజెన్స్? బట్. బి బోల్డ్. డోన్ట్ థింక్ సిల్లీ థింగ్స్. మీరు గనక ఈ పద్ధతిలో

ఆలోచిస్తే మిమ్మల్ని వాళ్ళే హత్యచేయాల్సిన పనిలేదు. మీకు మీరే నిత్యం ఆత్మహత్య చేసుకొంటారు."

అదరగొట్టడమూ అతని వంతే. ధైర్యం చెప్పడమూ అతని వంతే అయింది. ఎస్పికి గుర్రుగా వుంది. ఇలాంటి దాన్లో వున్న ఆనందం ఎస్పికి తెలియంది కాదు. కాని ఈసారి తాను కదా బాధపడ్తోంది.

"విష్‌యూ బెస్ట్ ఆఫ్ లక్." అంటూ అదే చిరునవ్వుతో షేక్ హాండిచ్చి సెలవు తీసుకున్నాడు ఇంజెస్పి.

ఎస్పి దీర్ఘంగా ఆలోచిస్తు ఉండిపోయాడు.

"ముగ్గురి 302 (హత్య)కి కారణమైన లక్ష్మణ్‌రావుని వదల్లేదు. యాదగిరి వాజ్ ద కాజ్ ఫార్ ఓన్లీ ఫోర్. బట్, మై సెల్ఫ్? ఓ మై గాడ్? నైన్. విల్ పవర్లో వీళ్ళకి వాళ్ళకి మాత్రం తేడా ఏం వుంది? ఎక్స్ ప్రైమ్ మినిస్టర్ ఆల్సో వెంట్ వాట్ కెన్ ఐ డూ?"

సి.సి. (క్యాంపు క్లర్కు) ఎక్స్‌టెన్షన్ ఫోన్ కుయ్యికుయ్యిమంటోంది. విసుగ్గా ఎత్తాడు ఎస్పి.

❄ ❄ ❄

"నమస్కారాలండీ ఎస్పీ గారూ !"

ఆలోచనల్లో మనిగి తేలుతున్న ఎస్పి తలెత్తి చూశాడు.

సత్యనారాయణరావు రెండు చేతులు జోడించి నమస్కరించాడు. నర్సయ్య వంగి దండం బెట్టి అలాగే వుండిపోయాడు.

రావు తొలుత నర్సయ్య విషయం ప్రస్తావించాడు.

అంతా విని కూడా ఎస్పి ఏదో ఆలోచిస్తున్నాడు. తనకు వెంటనే ఒకడు దొరికాడు. ఎందుకో ఆసక్తిగా నర్సయ్య కళ్ళలోకి చూసి చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వు అచ్చం ఇంజెస్పి నవ్వులాగా వుంది. ఆ గొంతులో కూడా ఇంజెస్పి గొంతులోలాగా వ్యంగం కాని వ్యంగ్యం ధ్వనిస్తోంది.

"సరే నీకు రివాల్వర్ శాంక్షన్ చేసినా 'వాళ్ళొచ్చి' లాక్కోరని ఏం వుంది?"

నర్సయ్యకి ఏం మాట్లాడాలో తోచలేదు. బిక్కమొగం వేశాడు. ఎస్పి సిగరెట్ ముట్టించి హుందాగా పొగవదిలాడు. బెల్లుకొట్టి కాఫీ ఆర్డరిచ్చాడు. కుర్చీ నిండుగా వున్న శరీరాన్ని ఉత్సాహంగా కదిలించాడు. ఏనుగు కదిలినట్టుగా వుంది. గీతోపదేశం యిస్తున్నాడులా వుంది.

"స్టేట్ ప్రొటెక్షన్‌కి కూడా కొన్ని లిమిట్స్ వున్నాయి కదా! నేను పోయే కారుమీదో, జీపుమీదో బాంబో, గ్రెనేడో వేశారనుకోండి నా రివాల్వర్ ఏం చేస్తుంది. స్టేట్ మాత్రం ఏం చేస్తుంది? ఎవరికి వాళ్ళం ఇండివిద్యువల్‌గా ధైర్యంగా వుండాలి నీ సేవలకి మనీ కూడా పే చేశాంగా. ఎలాగో మేనేజ్ చేసుకోవాలి."

"అదిగూడ సంతకం దీసుకున్నదాన్ల సగమే యిచ్చిన్రు సార్."

ఆ మాటతో రావూ, ఎస్పి ఒక్కసారిగా నర్సయ్యకేసి ఎగాదిగా చూశారు. అనవసర విషయాల ప్రస్తావన. పైపెచ్చు అధిక ప్రసంగం.

ఎస్పికి అన్ని విషయాలు తెలుసు. ఈ మధ్య టిడిపి మంత్రికి, రావు పార్టీకి పెళ్ళాం మగల కొట్లాట వంటి కోల్డ్‌వార్ సాగుతోంది. మళ్ళీ ఇద్దరూ ఒకటే. మధ్యలో తనని పావుగా విమర్శించి వాళ్లు రాజీకుదుర్చుకుంటారు. ఈసారి నుంచి అలాంటి ఎత్తులు సాగనీయకూడదు. ఎవడికీ చిక్కేది లేదు. అలా ఆలోచిస్తూ కొంత ఆగి ఎస్పి మళ్ళీ నిదానంగా అన్నాడు.

"ఇక్కడ నువ్వు ఇంకో విషయం గమనించాలి. నీకు రివాల్వర్ యివ్వడం అంటే ఏంటో తెలుసా? నువ్వు ఇన్ఫార్మరువని మేం సర్టిఫై చేశామన్నమాట. అంటే నిన్ను హత్య చెయ్యమని వాళ్ళకి సిగ్నల్ ఇచ్చినట్టే గదా?"

ఆ ఎత్తుగడ నర్సయ్యకి ఊహించని దెబ్బ. ముహంలో నెత్తుటి చుక్క లేకుండయ్యింది. తల వేలాడేశాడు. నేల చూపులు చూస్తున్నాడు. నాపరాళ్ళపై ఏదో పురుగుని చీమల బారు ప్రాణం వుండగానే లాక్కెలుతున్నాయి. కాలితో నలిచేశాడు నర్సయ్య.

రావు నర్సయ్య తరుపున మళ్ళీ తానే బతిమాలినట్టుగా అడిగాడు. ఎస్పీ ఓపిగ్గా మళ్ళీ మొదటి నుంచి వివరించాడు.

"కొనుక్కునేది మీరే అనుకోండి. ఐనా సర్టెన్ రూల్స్ ఫాలో అవ్వాలిగా!" నర్సయ్య వేపు చూశాడు ఎస్పి. "అయినా నీవు చావకముందే ఏ రుజువూ లేక

ముందే నిన్ను చంపగలరని ఎలా కన్ఫర్మ్ చేయడం? కనీసం నీ కాలో చెయ్యో అయినా తీసెయ్యలేదాయె. ఆఖరికి ఏదయినా ఆక్సిడెంట్లోనైనా పోగొట్టుకున్నోడివి కాదైతివి. ఏం చేయను? లేకపోతే ఫియర్ వికాస్ సంస్థ పేరిట తిప్పుకుంటూ తిండికి లోటు రాకుండా మేనేజ్ చేసేవాణ్ణి. వాళ్ళకి వ్యతిరేకంగా కొంత ప్రచారం చేసే అవకాశమూ నీకు దొరికేది. అదేమీ జరగలేదాయె. సో సారీ"

అంతలో కాఫీ వచ్చింది. రావుకు ఆఫర్ చేశాడు ఎస్పి. తాను యిప్పుడే తాగానన్నాడు. నర్సయ్యకి కాఫీ తీసుకోవడానికి ఎక్కడలేని సంకోచం మొదలయింది. భయం భయంగా తీసుకున్నాడు. మరోసారి చేతులు జోడించాడు.

దాంతో ఎస్పి ఎంతో జాలి పడ్డట్టుగా మొహం పెట్టాడు. రావుకేసి చూస్తూ ఓ ఉచిత సలహా ఇచ్చాడు.

"మీరే ఏదయినా సాయం చేయండి."

'సరే చూద్దాం' అన్నట్టుగా తలవూపాడు రావు. ఇక వెళ్ళమన్నట్టుగా నర్సయ్యకేసి చూశాడు రావు. నర్సయ్య ఎస్పి ఆఫీసు దాటి రావు కార్లో కూర్చున్నాడు. తమ కారుకి ముందూ వెనకా వచ్చిన జీపులు వూళ్ళోకెళ్ళి ఇంకా రానట్టున్నాయి. ఒంటరిగా అటూ యిటూ చూస్తూ కూర్చున్నాడు నర్సయ్య. మరో అయిదారు నిమిషాల్లో ఆ రెండు జీపులు వచ్చిచేరాయి. అంతలో రావు బయటికి వచ్చాడు.

రావు కారు స్టార్టయింది. దాని ముందు ఎస్కార్టులా ఆరుగురితో కూడిన జీపు బయలుదేరింది. కారు వెనక యిలాగే మరో జీపు.

తార్రోడ్ల గుండా ఒకటి వెంట ఒకటి దూసుకుపోతున్నాయి. రోడ్లమీద జనం గుంపులు గుంపులుగా వున్నచోటల్లా కారు స్లో అవుతుంది. స్లో అయినప్పుడల్లా రావు ఏదో బెదురుబెదురుగా అటూ యిటూ చూస్తున్నాడు. ఇది గమనించిన నర్సయ్య కిందివి కపాలానికంటుకున్నాయి. ఆ కార్లో వున్నట్లు తనని ఎవరైనా గమనించినా ప్రమాదమే. తల వంచుకుని ముందుసీటు వెనక తల దాచుకున్నాడు నర్సయ్య.

❄ ❄ ❄

నర్సయ్యని బంగళాలో దిగబెట్టి కొంత విశ్రాంతి తీసుకొని ఎటో వెళ్ళిపోయాడు సత్యనారాయణరావు.

నర్సయ్య ఆలోచనల్లో పడిపోయాడు. వరండాలో కాలుగాలిన పిల్లిలా అటూయిటూ భయంభయంగా పచార్లుచేశాడు. తాను పల్లె విడిచి మూడు రోజలవుతోంది. ఒక్కరోజులో వస్తానని చెప్పి వచ్చాడు. ఇంట్లో ఎంత ఆరాట పడుతున్నారో.

సత్యనారాయణరావు ఆహ్వానంలో ఏదో లోపించింది అని యింతదాకా మథన పడుతుంటే గుర్తుకురాలే. తాను దొరవద్దే ఉండిపోతే పెండ్లాం పిల్లలకు తిండి ఎలా? దొర ఇచ్చిన హామీలో లేనిది యిదే.

"ఇంత మందిలో నీకింత కూడు దొరుకదా? ఇక్కన్నే వుందామంటే వుండు. ఇక ప్రమాదాలంటావా? నాతోని నువ్వు"

ఈ ఏర్పాటు బాగానే వుంటుంది. ఎటు వెళ్ళినా పదిమందికి తక్కువ కలిసి వెళ్ళేది లేదు. అందరి వద్దా ఏదో ఒకటి ఆయుధం వుండనే వుండె. కాని పెండ్లాం పిల్లలు ఎలా?

దొరకి యిన్ని వ్యవహారాలున్నాయి. ఏదో ఒకదాన్లో తనను పొత్తుకు కలుపుకుంటే బావుండు. కలుపుకుంటాడో లేదో .... కలుపుకుంటానంటే యిక తనకి సమస్యలేదు. పెట్టుబడి పెట్టడానికి తన వద్ద ఆ డబ్బుందిగా!

ఎందుకో దొర తన మాట కాదనడని నమ్మకం కుదురుతోంది. రాగానే దొరతో ఈ విషయం మాట్లాడాలి. వెళ్ళి లచ్చవ్వకి వెంటనే ఈ ముచ్చట చెప్పాలి. అది ఎంత సంతోషపడుతుందో.

కాని నర్సయ్యకి ఆరోజు యింటికి వెళ్దామన్న ఆశ అడియాసే అయింది. అప్పుడనగా వెళ్ళిన రావు ఎంతో రాత్రికి గానీ ఇంటికి రాలేదు.

అదను చూసుకొని అడిగాడు నర్సయ్య.

"మీరన్నట్టు మీ దగ్గరుంటే మంచిగనే వుంటది గని"

నస పెట్టాడు నర్సయ్య.

ఏంటన్నట్టు చూశాడు రావు. భయం భయంగా ఎంతో వినయంగా తన మనసులో మాట బయట పెట్టాడు నర్సయ్య. లోలోపల వొప్పుకోక ఏం జేస్తాడు అన్న ధైర్యమూ వుంది. కాని బయటపడలే.

ఎంతలో ఎంత ఎదిగిపోయాడు దొర. ఎడ్ల కచ్చురం దప్ప ఏం చూశాడు యింతకుముందు. ఇన్నూరు ఎకరం వుందన్నది పేరుకేగాని ఏ పంట పండేది? ఇపుడు జూడు. కెనాల్ నీళ్ళు వచ్చాయి. ఇటు పిడబ్ల్యుడి. కాంట్రాక్టయ్యాడు. సిన్మాథియేటర్‌కి స్థలం కొన్నాడు. దొర పని తంతే గారెల బుట్టలో పడ్డట్టయింది. కోటీశ్వరుడయ్యాడు. తనకూ అలాగే ఏదో యింత లాభం దొరక్కపోతుందా? ఎంత మంది సహకరిస్తే దొర యింతెత్తు ఎదిగాడు!

ఆవులిస్తే పేగులు లెక్కబెడతాడు రావు. ఇవన్నీ ఒక్కమాటలో అర్థం అయిపోయినట్టే వుంది. కింది నుంచి పైదాకా కోపంతో మండిపోతోంది. కాని తమాయించుకున్నాడు. ఆలోచనలో పడ్డట్టు నటించాడు. 'నాతో పొత్తుకొస్తావురా లంజకొడుకా! అసలా ఆలోచన రావటానికి ఎంత ధైర్యంరా'

కాని బయటపడలేదు రావు. ముందు తనదగ్గరికి రానీ. దీపం పురుగు వెధవ. మాడ్చి మాడ్చి ఈడ్చిపారేయనూ! రెండు మూడు దోపిడీలు, మానభంగాల్లో మన పరిషత్ పొలగాన్లతోని పంపియ్యాలి. అంతదాకా ఓపిక పట్టక తప్పదు. అనక ఎక్కడికి వెళ్ళగలడు? తన దగ్గరికి వచ్చాక మళ్ళీ వెనక్కి వెళ్ళడమే? ఎంత యిన్సల్టు?

"సరే. సారా కాంట్రాక్టు అంటే యింకా టైం వుంది కదా. ముందయితే మాతోటి యిక్కడుండు."

నర్సయ్యకు ఆ రాత్రి సంతోషంతో నిద్రపట్టినట్టు లేదు. 'సారా కాంట్రాక్టులో తనకు పొత్తు. తనూ, తన పరపతీ, తన కుటుంబం ఏడాది రెండేళ్ళలో ఎంతగా ఎదిగిపోతుందో'... కమ్మని కలలు కంటున్నాడు నర్సయ్య.

❄ ❄ ❄

అక్కడ గదిలో ఒరిగిన సత్యనారాయణరావుకి నిద్ర రావడం లేదు. స్టీరియో టేప్ రికార్డర్లోంచి సన్నగా సంగీతం విన్పిస్తోంది. చికాగ్గా దాన్ని కట్టేశాడు. వారం రోజుల కిందటి పేపర్ కటింగ్ టేబుల్ సొరుగులోంచి తీశాడు. 'యు' ఫోం బెడ్లో వెల్లికిలా ఒరిగాడు. ట్యూబ్‌లైట్ వెలుతురులో మళ్ళీ ఓసారి చదివాడు. ఉదయం ఎస్పీ చెప్పిందీ అదే.

ఆ రెంటికీ పోలికలు అర్థమైన కొద్దీ ఒళ్ళంతా కంపర మెత్తుతోంది. ఇప్పటి కిప్పుడే ఒక్కొక్కన్ని రివాల్వర్‌తో తూట్లు పొడవాలన్నంత కసిగా ఉంది.

లంజా కొడుకులకి ఎలా జేసినా లాభమే కలుగుతోందంటాడు ఎస్పి. ఒక్కొక్కన్ని కాల్చిపారేయక యింకా ఆలోచించి చూడండి అంటాడేంటి? మెడమీద కత్తి! ఎప్పుడు తెగుతుందో తెలియదు. ఇంకా ఆలోచించడం ఏమిటి?

నిజమే. లీగల్ అవకాశాలు యివ్వడం మానేసి రెండేళ్ళయిపోయింది. అందుకే యింకా యింకా యిళ్ళు కూలగొట్టాలి. ఒక్కొక్కణ్ణీ ఒక్కొక్కర్తినీ ఎట్లా జేయాలంటే వాళ్ళని గురించి విన్నాక అందరూ గజగజలాడాలి. నిద్రలోనే వుచ్చపోసుకోవాలి. మళ్ళీ జీవితంలో రైతుకూలి సంగం, రాడికల్ సంగం అనకుండా చేయాలి.

కాని యిట్ల జేస్తే మన ముడ్డికిందకే నీళ్ళస్తయంటాడేంది ఎస్పి? నలుగురైదుగురు పోలీసాఫీసర్లు చచ్చిన్రో లేదో వీడికి ఉచ్చరాల్తున్నట్టుంది. అసలు విషయం అది. అది దాచిపెట్టి వీడు చాతనైతే మీరే చెయ్యిన్రి. లైసెన్సు లేని తుపాకులు ఎన్నయినా తెచ్చుకోన్రి అని అంటడు ఎస్పి. ఎవడన్నా ఎస్పి మాట్లాడే మాటలేనా యివి? మేమే అన్ని చేస్తే యిగ వీడేం చేస్తడంట. చేతులు లేనోని ఆకులు పీకుతడా?

మేమే అన్నీ జేస్తే టార్గెట్లోకి వచ్చి జెల్ది మేం చావలనేదేగ వీని ప్లాను !

ఎక్కువ మాట్లాడితే వాళ్ళవలన మీకేం నష్టం జరిగింది అని ఎదురు ప్రశ్న వేస్తాడు ఎస్పి. వీడేదో వీని సొమ్మే నేను తీసుకున్నట్టు మాట్లాడుతడు. ఔను. ఒకటికి పది వ్యవహారాలు చేస్తాను.. వీడికేందట కడుపు మంట! నెలనెలా తన మామూలు తాను దొబ్బక వదిలేస్తున్నట్టు నఖరాలేంది? లీగల్ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయినప్పుడల్లా పెండింగ్లో పడిపోయిన టార్గెట్ లిస్టులన్నీ ఎజెండా మీదికొస్తాయట ! ఏ పనీ చేయడానికి అవకాశం యివ్వకపోతే యిక తరుగుడు పనేనట ! వీడి తలకాయ. తరగడం అంటే ఏమనుకుంటున్నడో ఎస్పి? బీరకాయలా దోసకాయలా? ఇంత మంది మధ్యలో ఎట్లా సాధ్యం?

ఏమో! పుసుక్కున జరిగితే? లంజకొడుకులు అన్నిటికీ తెగించిన వాళ్ళు. వాళ్ళకు భయపడే ముందు. బత్తుల బక్కయ్యను జంపిస్తి. పల్ల్ రాజశం రాజన్నను జంపిస్తి. కైరి గంగారాంను జంపిస్తి. శ్యాంను ఏకీలుకాకీలు విరగ్గొట్టిస్తి. గోవిందరెడ్డిని చంపిస్తి. తక్కళ్ళపల్లి శంకర్, మ్యాడంపెల్లి శంకర్లని ముక్కలు ముక్కలుగా తమ పాలెగాన్లతోటి నరికిస్తి. ఆఖరుకు పులి – పులి గాదు సింహం. కలల కనబడ్డా ఉచ్చరాలేది.. అసొంటి సాయిని ప్రభాకర్ జచ్చినా, డాక్టర్

రాంనాథం జచ్చినా ఎవడూ జెనుకడేంది? తగ్గి ఒక్కసారిగా మీదపడుతున్నరేంది?

రేణికుంట రావును పట్టపగలే జంపిరి. మన వాళ్ళని యిద్దర్ని దారి కాచి చంపిరి. ఏం జేసిన్రు. వాళ్ళ ఆకులెవడన్నా పీకిండా?

లంజాకొడుకుని. ఈ ఎస్పిగాడు లేని భయం పెట్టెగద. ఇప్పటికే ఉచ్చరాల్తంటే వీడు యింకింత భయపెట్టె గద! ఇంతజేస్తే నా ప్రమేయం వున్న హత్యలెన్నట? మహా అయితే పదిహేను గావచ్చు.

వీడు ధైర్యం చెప్పాల్నా ! స్టేట్ ప్రొటెక్షన్‌కి కూడా పరిమితులుంటాయని పిరికిమందు నూరిపోస్తాడా? పోలీసులే గిట్లంటే యిగ ఎట్ల ?

నిజమే ఎస్పి చెప్పిందాన్లో నిజంలేదా? ఎస్పి చెపితేనే నాకు తెలుసా ఏంది? ఆ రేణికుంట రావు పోయాక అతని కుటుంబం ఎంత ఘోరంగా విచ్ఛిన్నమై పోయింది ! ఎలాంటి కుక్కచావు అది ! పోస్టుమార్టం కోసం వెళ్ళిన శవం ఆసుపత్రిలో అలాగే వుంది. ఒక్క కొడుకయినా అక్కడ లేడు. కనీసం ఒక్క కూతురైనా ఏడ్వడానికి అక్కడేవుంది. వుంచుకున్నదానియింటి ముందు కారుండిపోయింది. ఎవడైనా తీసికెళతారేమోనని టైర్లు తీసి దాచే ప్రయత్నంలో వున్నారు. బ్యాంకులోని సేఫ్టీ లాకరు కీల కోసం డాక్యుమెంట్లకోసం ఎవరికివారు వెతుక్కుంటున్నారు. ఎవరికీ ఆ శవం గురించి పట్టినట్టు లేదు. చికాగ్గా మంచంలోంచి లేచాడు రావు. నిద్ర రావడం లేదు. సిగరెట్ తీసుకొని అగ్గిపుల్ల గీకుతున్నాడు.

అంతే! కరెంటు పోయింది. గదంతా చీకటైపోయింది. అగ్గిపుల్ల గీకిన వెలుగుకి ఎవరివో నీలి నీడలు గదంతా పరుచుకున్నట్టుగా వున్నాయి. ఆ నీడలే స్విచ్ ఆఫ్ చేశారేమో. పై ప్రాణాలుపైనే పోయాయి. శ్వాస ఆడ్డం కష్టమైపోయింది. గొంతుని పట్టి ఎవరో పిసుకుతున్నట్టుగా వుంది. అచ్చం సాయిని ప్రభాకర్ ఆకారం లా వుందది. కాని అప్పటికి సాయిని ప్రభాకర్ హత్య చెయ్యబడి అయిదు నెలలైపోయాయి. ఏమో వాళ్ళ పార్టీ వాళ్ళేనేమో. చేతిలోని అగ్గిపుల్లా, నోట్లోని సిగరెట్టూ భయంతో కింద రాలిపడిపోయాయి. దిండు కింద రివాల్వర్ కన్పించలేదు. ఎలాగో గొంతు పెకలించుకొని అరిచాడు రావు. మెదడు పనిచేయడం మానేసింది.

"అమ్మో. వాళ్ళు వాళ్ళు మెడ పిసుకుతున్నరు. రాన్రి. రక్షించున్రి."

ఆ ఆర్తనాదం ప్రమాదసూచి సైరన్‌లా ఆ భవనమంతా ప్రతిధ్వనిస్తోంది. అన్ని అడుగుల చప్పుళ్ళు ఆ గదికేసి పరుగులు దీశాయి. అంతా కోలాహలంగా వుంది. రైఫిల్స్, రివాల్వర్స్ సరిచూసుకుంటూ పరిగెడుతున్నారు. ఆ గడబిడకు నర్సయ్య ఒళ్ళు జలదరించింది. ఉన్నకాన్నుంచి ఎటు కదిలితే ఏం ప్రమాదమో. తననే 'వాళ్ళ'నుకొని సఫా చేస్తే?

అంతా చీకటి. బిక్కచచ్చిపోయి అలాగే కళ్ళు మూసుకున్నాడు. ఎవరో అగ్గిపుల్ల గీకారు. దాన్ని దోసిట్లో ఆరిపోకుండా పట్టుకొని నడుస్తున్నారు. చీకట్లో నడుస్తున్నవాడల్లా ఫెడీల్మని నర్సయ్యమీద పడిపోయాడు.

ఒక్క క్షణం నర్సయ్య గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. పుణికి చూసు కున్నాడు. ఏదో రైఫిల్ తనమీద పడి ఛాతీలో దెబ్బ తగిలింది. పడ్డవాడి స్థితీ అలాగే వుంది. భయంతో ఒక్క ఉదటున ఎగిరాడు. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. నర్సయ్య కొంచెం వెనక్కి జరిగాడు. కాళ్ళు మరింత ముడుచు కున్నాడు. అతను అటుకేసి వెళ్ళిపోయాడు.

అంతలో కొవ్వొత్తులు వెలిగాయి. గేటు వద్ద గార్డులు అలర్ట్ అయిపోయారు. ఎంత వెదికినా ఎవరూ కన్పించలేదు. కొత్తవాళ్ళ అలికిడీ, ఆనవాలు అసలు కన్పించలేదు. అంతలో కరెంటు వచ్చింది.

రావుకు గుండె దడ తగ్గింది. మెదడు మళ్ళీ పనిచేయడం మొదలయింది. అయితే అది తన నీడేనన్నమాట. రివాల్వర్‌ను పరుపుపై విసురుగా విసిరేసింది మరిచిపోయి దిండు కింద వెతికాడన్నమాట. హమ్మయ్య.

తలుపులు గట్టిగా బిడాయించి మళ్ళీ మంచంలో ఒరిగాడు రావు.

నర్సయ్య సంతోషం పటాపంచలయింది. నిత్యం అనుక్షణం పదిపదిహేను మంది ఉంటారిక్కడ. అయినా దొర భయపడుతున్నాడు. మరి తన ఆలోచన సరయిందేనా? ఏమో, లచ్చవ్వని సలహా తీసుకోవాలి. అయినా దానికేం తెలుసు బొంద. ఇవన్నీ చెబితే ఉత్తగనే గజ్జన వణికి బొజ్జన ఉచ్చపోసుకుంటది. ఇంతమందిమి వున్నంక ఎవడైనా ఎట్లా వస్తాడు? ఎంత ధైర్యం కావాలి!

అలా ఆలోచిస్తూ ఎపుడు నిద్రపోయాడో.

❄ ❄ ❄

రాత్రి భోంచేశాక నర్సయ్య ఆ విషయం చెప్పిన్నుంచి అదేపనిగా రోదిస్తోంది లచ్చవ్వ. పఱ్రుపఱ్రున చెమటకాయ గీకుతున్న పిల్లలు భయంగా చూశారు.

తల్లిలాగే పిల్లలు ఏమిటో తెలియకున్నా ఏడుపందుకున్నారు. పెద్దోడు మాటిమాటికీ కప్పెడు కప్పెడు చీమిడి గోడకు రాస్తున్నాడు. సత్తెవ్వ తల్లి ఒడిలో ఒరిగిపోయింది.

"నన్నూ నా పొరగాన్లను ఆగంజేసి పొదామనుకున్నవ? అక్కడ మల్ల ఎవతినన్న ఉంచుకుందామని చూస్తున్నవా?"

నర్సయ్య మనసు కరగలేదు. ఇక్కడి ఒంటరి బతుక్కన్నా అది ఎంతో హాయి. రోజూ కమ్మని తిండి తినొచ్చుకూడా. లాభానికి లాభం.

కొంగుతో తన కళ్ళని తానే తుడుచుకుంది లచ్చవ్వ. మళ్ళీ జీరబోయిన గొంతుతో రోషంగా అడుగుతోంది.

"వాల్లు పైసలు దీస్కోని ఎగవెడితే మల్ల ఎవలకు చెప్పుకుంటవు? నీ దగ్గర గన్ని పైసలు ఎక్కడియంటె ఏమని చెప్పుతవు? వాడు ఎంత మందిని ముంచితే గట్ల పెరిగిండో తెల్వదా?"

నర్సయ్య నిలువునా నీరుకారిపోయాడు. నిజమే. ఒకవేళ అలా జరిగితే ఎలా? చెప్పుకోవడానికి మాత్రం ఎవరున్నారు. తన గురించి ఈ వూళ్ళోనే ఎవ్వరూ మాటసాయమైనా రారాయె! ఎవన్ని చూసినా లంజకొడుకులు 'ఎపుడో ఓసారి పొడిచిపారేస్త లంజకొడుక' అన్నట్టే చూస్తరాయె. అక్కన్నుంచి దొర వెళ్ళగొట్టిన్నాడు తన గతి?

తాను అనవసరంగా భయపడుతున్నాడు. ఎవరికీ తనపై అనుమానమొచ్చినట్టు దాఖలా లేదు. ఏడాది గడిచింది. పైన నాలుగు నెలలుకూడా గడిచాయి. అంతా తన పిరికితనం. అమ్మో! ఎందుకు తెలియదు. ఒక్కొక్కడు తనకెయి ఎట్ల జూస్తుంటడు. అయినా ఏం చేయగలడు తాను. ఈ దీనికన్నా దొరదగ్గరుంటేనే ధైర్యం.

"ఊఁ పండుకోవ్రి. నేను యిప్పుడే ఏం ఛస్తలేను. నోరు ముయ్యుృని."

యధావిధిగా ఉక్కపోతలో ముసుగుతన్ని పడుకొన్నాడు నర్సయ్య. ఏడ్చి ఏడ్చి ఎపుడు నిద్రపోయిందో లచ్చవ్వ. కలత నిద్రలో ఏదోకల పడి ఉలిక్కిపడి

నిద్ర లేచింది. కలలో తాను 'వాళ్ళ' కాళ్ళపై పడి ఏడుస్తోంది. వాళ్ళు వినిపించుకో లేదు.

"కనీసం చచ్చేముందన్నా నిజం చెప్పరా"

నర్సయ్య చెంప చెళ్ళుమన్నది. లింగయ్య దీనంగా అరుస్తున్నాడు.

"నేను అంతా చెప్పిన. నిజం ఒప్పుకోయే నర్సన్నా."

ఆ మాటతో కుప్పకూలిపోయాడు నర్సయ్య. ఎవరో లేవనెత్తారు.

"అయ్య. నిజమే"

కర్రలు, గొడ్డళ్ళు, తుపాకుల దెబ్బలతో నర్సయ్య ఎండుటాకులా రాలిపోయాడు. లచ్చవ్వ, పిల్లలు ఏడుస్తూనే వున్నారు. ఊరంతా నిలబడి ఉత్సాహంగా చోద్యం చూస్తున్నారు. వాళ్ళేవో నినాదాలు యిచ్చారు. ఆ నినాదాల్లో తమ ఏడ్పులు వినిపించడంలేదు.

భయంతో నిద్రనుంచి లేచి అటు యిటు చూసింది లచ్చవ్వ. పిల్లలు నిద్రపోతున్నారు. నర్సయ్య గాఢనిద్రలో వున్నట్టున్నాడు. ఏదో స్థిర నిశ్చయాని కొచ్చింది లచ్చవ్వ. తలుపుతీసి చూసింది. ఇంకా తెలవారినట్టులేదు. పిల్లల్ని అలికిడి కాకుండా లేపింది. ఆ మసక చీకట్లో తల్లి గారింటికి బయల్దేరింది.

నర్సయ్య లేచిచూసేసరికి పొద్దెక్కింది. ఇంట్లో ఎవరూలేరు. ఆశ్చర్య పోయాడు. ఇదీ ఒకందుకు మంచిదేలే. ఈ కాస్తా అడ్డు తొలగిపోయింది. పీడాపోయింది. ఇక దొర దగ్గరికెళ్ళడానికి తననడ్డుకునే వాడెవడూ లేదు. తృప్తిగా నిట్టూర్చాడు నర్సయ్య.

అలా మరో బలిపశువు రాజ్యంకోసం వూబిలో లోతుగా దిగబడిపోయింది.

**కథాకాలం 1984-86**

**అరుణతార మాసపత్రిక ఫిబ్రవరి 1988**